క్లుప్తంగా

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరును బాగు చేయిస్తున్న లక్ష్మణరావు

కొత్తూరు: మండల కేంద్రంలో పాడైన రెండు బోర్లను మంగళవారం బాగు చేశారు. బోర్లు పాడైనట్లు సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్సీపీ నాయకుడు లక్ష్మణరావుకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సర్పంచ్‌తో పాటు లక్షణరావు స్పందించి బోర్లను బాగు చేయించి ప్రజలకు తాగునీరు అందించారు.

వెద పొలాలు సిద్ధం



అన్నంపేటలో వెద జల్లేందుకు సిద్ధం చేసిన పొలం

బూర్జ: మండలంలో ఖరీఫ్ వరి పంటలకు వ్యవసాయ భూములు సిద్ధం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో దుక్కిలు దున్ని, గట్లు బాగుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాలను వెదలు చల్లేందుకు తయారుచేశారు. వర్షుడు కర్షుస్తే విత్తనాలు కూడా వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు



విద్యుత్ వెలుగుల్లో తహసీల్దార్ కార్యాలయం

కొత్తూరు: ఈ నెల 12 తేదీన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు స్థానిక తహసీల్దార్ ఎం.వి.ప్రసాదరావు మంగళవారం తెలిపారు. తహసీల్దార్, మండల పరిషత్, తదితర కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ఆలంకరించారు.

గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



సిద్ధు (ఫైల్)

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి తర్లాడ సిద్ధు (21) మంగళవారం గండెపోటుతో మృతిచెందాడు. హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతూ ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు స్వగ్రామం వచ్చాడు. హైదరాబాద్ వెళ్తుండా మార్గమధ్యలో గుండెపోటువచ్చి చనిపోయాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. ఈయన తండ్రి సుధాకర్ సర్పంచ్‌గా పనిచేస్తూ అకాల మరణం చెందాడు. ఈయన తాత ఈశ్వరరావు ప్రస్తుతం మూలసవలాపురం సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. యువకుడి మృతిపట్ల గ్రామస్తులు, బంధువులు, యువకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రూ.60 వేల ఆర్థికసాయం



అప్పన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు తమ ఔదార్యాన్ని చాటారు. మండలంలోని గొట్టిపల్లి గ్రామానికి చెందిన గొర్లె రమేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. రమేష్ కుటుంబానికి ట్రస్టు సభ్యులు మంగళవారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన లిమ్మక రామారావు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం రామారావుకు రూ. 20 వేల నగదు అందించారు. పారాపురం గ్రామానికి చెందిన పెనుగొండ అప్పన్న టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పన్నకు పక్షవాతం రావడంతో వైద్యం ఖర్చుల నమిత్తం రూ. 20 వేలు సాయం చేశారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో మురగడబట్టి, నడింబట్టిలో పూడిక తీత పనులను టీడీపీ నాయకుడు కిల్లి లక్ష్మణరావు మంగళవారం ప్రారంభించారు. ఈ రెండు కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గున్ను నర్సింహమూర్తి, పైడి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● భక్తిశ్రద్ధలతో మందిర వార్షికోత్సవం



సారవకోట మండలంలోని అలుదు గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం స్థానిక హనుమాన్ మందిర వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు నాగభూషణరావు ప్రత్యేక, విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

– సారవకోట

● అన్నదానం



ఆమదాలవలస మండలంలోని వంజంగి గ్రామ మెయిన్ రోడ్డులో ఉన్న ముకుంద తిరుమల ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, విశేష అలంకరణ, విశేష దర్శనం, లక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేంకటేశ్వర యువజన సంఘం సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– ఆమదాలవలస

● నీలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పాతపట్నంలోని మహేంద్రతనయ నదీ తీరాన ఉన్న నీలకంఠేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా ఉదయాన్నే ప్రధాన అర్చకులు పార్వతీశం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చనలు, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్న ప్రసాదం, రాత్రికి స్వామివారికి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాతపట్నం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– పాతపట్నం

ఎత్తిపోతల్లో కష్టాలు



పూడికపోయిన పిల్ల కాలువ



ఎత్తపోతల పథకం



ట్యాంక్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

- అరకొరగా సాగునీరు
- ఆందోళనలో రైతులు

సరుబుజ్జిలి: మండలంలోని డకరవలస గ్రామంలో నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ నుంచి 2009లో రూ.47 కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు.ఎ పథకం నిర్వహణలో పట్టించుకునేవారే లేకపోవడంతో ఎప్పుడు పనిచేస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. డకరవలస, కొండ్రగూడ, తాటికొండ, సుభద్రాపురం, చిగురువలస తదితర గ్రామాలకు సంబంధించిన సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని నిర్మించారు.

నిర్వహణ లోపాలు..

డకరవలస ఎత్తిపోతల పథకానికి కొత్తకోట రిజర్వాయర్ నుంచి సాగునీరు అందాలి. రిజర్వాయర్‌లో ఆక్రమణలతోపాటు ఏళ్ల తరబడి పూడికలు పేరుకుపోయి మైదానాన్ని తలపిస్తుంది. రిజర్వాయర్ నుంచి సాగునీరు ప్రవహించే పిల్ల కాలువ పూర్తిగా పూడికపోయింది. ఎత్తిపోతల పథకం ట్యాంకులోకి నీరు రావడం కష్టమవుతుంది. ఎత్తిపోతల పథకం నిర్వహించే ఆపరేటర్‌కు సక్రమంగా జీతాలు అందడంలేదు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల తరచూ విద్యుత్ పంపిణీలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఖరీఫ్, రబీ వ్యవసాయ కాలంలో ఇబ్బందులు తప్పడంలేదు.

అధికారులు దృష్టి సారించాలి



ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పథకం సామర్థ్యం తక్కువ కావడం వల్ల కొన్ని గ్రామాలకు సాగునీరు అందడంలేదు. ప్రాజెక్ట్ నిర్వహణ పట్ల అధికారులు అంతగా ఆసక్తి చూపడంలేదు. దీనివల్ల ప్రతిఏటా నీటికష్టాలు తప్పడంలేదు.

– సురవరపు నాగేశ్వరరావు,రైతు, కొత్తకోట

పట్టించుకునేవారే కరువు



కొత్తకోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకానికి నీరు ప్రవహించకపోవటంతో ప్రతి ఏటా నీటి కష్టాలు వస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నీరు ప్రవహించే కాలువ పూడికపోవడం వల్ల సరైన సమయంలో నీరు అందడంలేదు.

– టి.తులసీరావు, రైతు, సుభద్రాపురం

మరమ్మతులు చేస్తాం

దకరవలస ఎత్తిపోతల పథకం మరమ్మతులకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– శంకరరావు, ఇరిగేషన్ ఏఈ

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలిన శ్రేణులు



ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన కూటమి నేతలు

సరుబుజ్జిలి: సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి మండలానికి చెందిన కూటమి నాయకులు మంగళవారం బస్సుల్లో తరలివెళ్లారు.

జనసేన నేత దానేటి శ్రీధర్ ఏర్పాటు చేసిన బస్సుల్లో అమరావతి బయలదేరారు. స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో బస్సులను తరలించే ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పోలమాంబ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు



హోమాలు చేస్తున్న అర్చకులు

గార: కొర్ని గ్రామంలోని పోలమాంబ తల్లి ఆలయం పురాతనమైనది. రాతి ఆలయం నిర్మించిన తర్వాత ఏటా వార్షికోత్సవాలన్ నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా తొమ్మిదో వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా జరిపారు. ఉదయం నుంచి అర్చకులు ప్రసాద్‌శర్మ, సతీష్‌శర్మ, అవినాష్ శర్మల అర్చకబృందం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలకరణలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. పోలమాంబ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పోలమాంబను దర్శించుకున్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణ ఘట్టం

కవిటి: మండలంలోని బొరివంకలో వెలసిన పార్వతి సమేత శ్రీరామలింగేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి శీతల షష్టి తొమ్మిది రోజుల ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గ్రామానికి చెందిన కొత్తపల్లి రంగారావు ఆచారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదట రోజు శివపార్వతుల కల్యాణంతో ప్రారంభమవుతుందని అనంతరం గ్రామంలోని పురవీధుల్లో స్వామివారిని తిరువీధి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఒకటో టౌన్ ఫీడర్ పరిధిలో ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం రోడ్డు వెడల్పు కారణంగా గురువారం విద్యుత్ స్తంభాలు వేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్ ఈఈ బి.బయ్యన్నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరీ పీఠంలో వేంచెసిన సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహించి అలంకరణ చేశారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం



సాయాన్ని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కృష్ణారావు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లను పోగొట్టుకొని మంచానికే పరిమితమయ్యాడు. దీంతో అతని కుటుంబం ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఈదుపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకువచ్చారు. ఏడు వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని కృష్ణారావుకు మంగళవారం అందించారు.

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం కూర్మారావు

ఆమదాలవలస: ఖరీఫ్‌కు ముందుగా నవధాన్యాలు సాగు చేస్తే భూసారం పెరుగుతుందని ఏపీఎం కూర్మారావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సేంద్రియ వ్యవసాయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. పంటల్లో రసాయన ఎరువులు తగ్గించాలనే ఉద్దేశంతో ప్రతీ రైతు నవధాన్యాల సాగుతో పచ్చిరొట్ట ఎరువులు కలియ దున్నడం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. పంటకు కావలసిన నీటిని పొలంలో నిల్వ ఉంచుకునే సామర్థ్యన్ని కలిగి ఉంటుందన్నారు. వెలుగు, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. తొలకరిలో జల్లి, దమ్ము చేయడం ద్వారా నేలకు, పంటకు చాలా ఉపయోగపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య సిబ్బంది, క్లస్టర్ కోఆర్డినేటర్లు రామప్పడు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



త్రినాథరావును సత్కరిస్తున్న రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు

మెళియాపుట్టి: ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ సహజమని పాతపట్నం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు అన్నారు. మెళియాపుట్టి మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన కె.త్రినాథరావును మంగళవారం సత్కరించారు. ఉపాధ్యాయ జీవితంలో ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషిచేశారని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను సన్మార్గంలో నడిపే గొప్ప అవకాశం ఉపాధ్యాయులకే ఉంటుందని, ప్రతిఒక్కరూ గురువులను గౌరవించాలన్నారు. సన్మాన గ్రహీత త్రినాథరావు మాట్లాడుతూ ఇన్నాళ్ల ఉద్యోగ జీవితంలో సహకరించిన సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 దేవేంద్రరావు, ఎంఈఓ-2 పద్మనాభరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తం



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



సారవకోట: ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు

సారవకోట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మంగళవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నామ పీహెచ్‌సీ వైద్యురాలు దేవిక తెలిపారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్జ పీహెచ్‌సీ వైద్యుడు జి.రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో మురికి నీరు, వర్షం నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో దోమలు గుడ్లు పెట్టి అభివృద్ధి చెందకుండా నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అంటురోగాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రంలో సీహెచ్ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ టి.తేజారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.